సాక్షి
ప్రకాశం
సోమవారం । 17 । జూన్ । 2024



నూరేళ్ల నేరేడు

పశ్చిమ ప్రకాశంలో వర్షాభావ పరిస్థితులకు తోడు ఖర్చు తక్కువగా ఉండటంతో రైతులు నేరేడు సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. - 8లో..



తేనెటీగల దాడిలో ఒకరు మృతి

తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు గ్రామంలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
39.1/31

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

ఒంగోలు: ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సురేష్, డాక్టర్ మేరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. ఇస్లాం ధర్మ శాస్త్రం ప్రకారం బడుగు, బలహీనవర్గాల అణిచివేతను వ్యతిరేకించి ధర్మసంస్థాపన కోసం, పేదల ఉద్ధరణకు యుగపురుషుడు అబ్రత్ ఇబ్రహీం జీవితాంతం చేసిన త్యాగాలకు ప్రతీకగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే ఈ రెండో అతిపెద్ద పండుగ సందర్భంగా ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల, కాంప్లెక్స్ నిర్వహణ గ్రాంటు విడుదల చేయాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎంల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

ఒంగోలు: పాఠశాల నిర్వహణ గ్రాంటు, కాంప్లెక్స్ నిర్వహణ గ్రాంటు వెంటనే విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని హెడ్మాస్టర్ల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకట్రావు కోరారు. ఆదివారం స్థానిక సంఘ భవనంలో సంఘ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని, ప్లస్ టూ పాఠశాల నిర్వహణ నిమిత్తం ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని కోరారు. నాడు - నేడు విధుల నుంచి ప్రధానోపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు టి.కాంతారావు అధ్యక్షత వహించగా, కోశాధికారి జీఎస్ఆర్ సాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ సుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- వాకా జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

కనిగిరి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జోనల్ స్థాయి సమావేశం పీ రాజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ డీఈఓ కార్యాలయంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, తెలుగు స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లిస్ట్ వెంటనే ప్రకటించాలని, 117 జీవోను రద్దు చేయాలని, విద్యా రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి రసూల్ మాట్లాడుతూ ప్రతి హైస్కూల్‌కు తప్పని సరిగా హెచ్‌ఎం పోస్టు ఇవ్వాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు హజరత్ రెడ్డి, మచ్చా ప్రసాద్, పాకాల శ్రీను, జీఎస్ ఆనంద్, కే రామ్మోహన్, డి సుబ్బారాయుడు, పాట్టేండ్ల మాలకొండయ్య, జీ రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు ఫిట్‌లెస్

పిల్లల్ని ఉదయాన్నే ముస్తాబుచేసి బడికి పంపేందుకు స్కూల్ బస్సు ఎక్కించిన దగ్గర నుంచి సాయంత్రం వాళ్లు తిరిగి క్షేమంగా ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులకు గుబులుగానే ఉంటుంది. సమయానికి పిల్లల్ని బడికి పంపాలని వేలకు వేలు ఫీజులు పోసి స్కూల్ బస్సుల్లో పంపుతున్నా అవి ఎంత వరకు సురక్షితమన్న ప్రశ్న తలెత్తుతోంది. జిల్లాలో చాలా వరకు విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా.. సరైన నిబంధనలు పాటించకుండానే యథేచ్ఛగా నడుపుతున్నారు. అటువంటి బస్సులను తనిఖీ చేసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామంటున్నారు రవాణాశాఖాధికారులు.

- జిల్లాలో మొత్తం విద్యా సంస్థల బస్సులు 1600 పైమాటే
- వీటిలో ఫిట్‌నెస్ పూర్తయినవి 1300 మాత్రమే
- ఇంకా 300 బస్సుల ఫిట్‌నెస్‌కు ముందుకు రాని యాజమాన్యాలు
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు



స్కూల్ బస్సులు తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారులు

ఒంగోలు:

బడి బస్సు భద్రమేనా అన్నది విద్యార్థుల తల్లిదండ్రుల్లో మెదిలే ప్రశ్న. ఏటా విద్యా సంస్థలు ప్రారంభమవుతున్నాయంటే రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం, యాజమాన్యాలకు సూచనలిస్తూ బస్సులను కండీషన్‌లోకి తీసుకొచ్చేలా కొరడా ఝుళిపించడం పరిపాటి. జిల్లాలో మొత్తం 1600 వరకు పాఠశాల, కాలేజీ బస్సులు నడుస్తుండగా వాటిలో ఇంకా 300 బస్సులు ఫిట్‌నెస్‌కు రాకపోవడంతో అవి ఎక్కడ ఉన్నాయి, వాటి పరిస్థితి ఏమిటి, ఏ రూట్లో అవి తిరుగుతుంటాయనే దానిపై రవాణాశాఖ అధికారులు ప్రస్తుతం దృష్టిపెట్టారు.

నిబంధనలు ఇలా..

బడి బస్సులు నడపాలంటే అనేక నిబంధనలున్నాయి. వాహనం కండీషన్‌లో ఉందా లేదా అనేది తనిఖీచేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు.

- వాహనంలో అకస్మాత్తుగా ఏవైనా మంటలు వస్తే ఆర్పేందుకు అగ్ని నిరోధక పరికరాలు ఉండాలి.
- ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరి. అందులో ప్రాథమికంగా అవసరమైన టించర్, కట్టు గుడ్డ, అత్యవసర టాబ్లెట్లు, దూది, కత్తెర వంటివి ఉండాలి.
- డ్రైవర్ పక్కన, రెండో వైపు ఉండే అద్దాలు సరిగా ఉన్నాయా లేదా అనేది చూడాలి.
- బస్సు వెనుక భాగంలో తప్పనిసరిగా విద్యార్థినీ విద్యార్థులతో కూడిన ఫొటో ఒకటి ముద్రించి ఉండాలి. ప్రత్యేకంగా ఐఈబీ అంటే ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ బస్ అనే పదం ఉండాలి.
- బస్సుకు ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిర్యాదుల పుస్తకం, బస్సు రూట్ ప్లాన్ ఉండాలి.
- ప్రతి బస్సుకు ఒక అటెండెంట్ ఉండాలి. అతను పిల్లలను బస్సు ఎక్కించుకునేటప్పుడు, పిల్లలను బస్సు నుంచి దించేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్డు దాటాల్సి వస్తే అంటెండెంట్ వారిని సురక్షితంగా ఆవలికి చేర్చాలి. కదులుతున్న బస్సులోకి విద్యార్థులను ఎక్కించుకోరాదు. ఇక బస్సులో సీట్ల సంఖ్యకు తగ్గట్లుగానే విద్యార్థులను ఎక్కించుకోవాలి.
- పాఠశాల బస్సులకు అద్దాలలో గుండా చిన్నారులు చేతులు బయటకు పెట్టకుండా మెష్ కూడా ఉంచాలి.
- అత్యవసర ద్వారం పనిచేస్తుందా లేదా అన్నది చెక్ చేసుకోవాలి.
- పాఠశాల నుంచి ప్రతి రోజు ఒక పేరెంట్ లేదా టీచర్ ఒకరు తప్పనిసరిగా బస్సులో ప్రయాణించేలా చర్యలు చేపట్టాలి.

నిబంధనలు హుష్ కాకి

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రవాణాశాఖ వద్దకు వెళ్లినప్పుడు బస్సులో అన్నీ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. కానీ అనంతరం నిబంధనలకు తిలోదకాలు ఇవ్వడం పరిపాటిగా మారుతోంది. 60 సంవత్సరాల వయస్సు దాటిన వ్యక్తిని డ్రైవర్‌గా నియమించరాదని, అదే విధంగా కనీసం 5 సంవత్సరాల బ్యాడ్జీ లైసెన్స్ లేనివారిని బస్సుల్లో డ్రైవర్‌గా నియమించరాదని నిబంధనలు ఉన్నా వాటిని ఉల్లంఘిస్తున్నారు. వృద్ధులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, ఫుట్ బోర్డు ప్రయాణం ఇలా ఒకటేమిటి అనేక నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోంది. చేయి ఎత్తగానే బస్సులను నడిరోడ్డుపై ఆపడంతో వెనుక వచ్చే వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటుంటాయి.

- ▲ గతంలో ఏడుగుండ్లపాడు వద్ద ఒక కాలేజీ బస్సును రోడ్డుపై ఆపగానే వెనుక నుంచి వచ్చిన మరో భారీ వాహనం ఢీకొంది. అదృష్టవశాత్తు ఈ బస్సులో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.
- ▲ చదలవాడ సమీపంలో ఒక కాలేజీ బస్సు వేగంగా మలుపు తిరుగుతున్న సమయంలో బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది.
- ▲ ఇటీవల వల్లూరు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీ బస్సు కింద పడి అదే కాలేజీ విద్యార్థి మృతిచెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం.


ఈ నేపథ్యంలో బస్సు నడిపే డ్రైవర్ మానసిక స్థితిని కూడా అంచనా వేసుకోవాల్సి ఉంటుంది. డ్రైవర్ ప్రశాంతంగా ఉంటేనే బస్సులో ప్రయాణించే విద్యార్థులంతా క్షేమంగా ఉంటారు.

ఫిట్‌నెస్ లేకుంటే బస్సు సీజ్



విద్యా సంస్థల బస్సులన్నీ పూర్తి ఫిట్‌నెస్‌తోనే రోడ్డుపైకి రావాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్, బీమా, ఫస్ట్ ఎయిడ్ బాక్సు వంటివి బస్సులో తప్పనిసరి. ఎవరైనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకుంటే బస్సును సీజ్ చేస్తాం. యాజమాన్యాలు ముందుగా బస్సులన్నింటినీ సమీపంలోని రవాణాశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి ఫిట్‌నెస్ పరీక్షకు హాజరై సర్టిఫికెట్ పొందాలి. డ్రైవర్ అతి వేగంతో వాహనం నడపడం, మద్యం తాగి వాహనం నడపడం చేయరాదు. రహదారి నియమ నిబంధనలు పాటిస్తూ జిల్లాను ప్రమాద రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ రవాణాశాఖకు సహకరించాలని కోరుతున్నాం. అదే విధంగా బస్సులకు చెల్లించాల్సిన పన్నులన్నింటినీ తప్పక చెల్లించాలి.

– ఆర్.సుశీల, రవాణాశాఖ ఉప కమిషనర్



ఆటోలకు కనిపించని నిబంధనలు

ఆటోల్లో అయితే పిల్లలను కుక్కి మరీ తీసుకెళ్తున్నారు. కిక్కిరిసి ఉన్న పిల్లలతోపాటు బ్యాగులు కూడా వేలాడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తుంటాయి. డ్రైవర్ పక్కన సైతం ఇబ్బడి ముబ్బడిగా పిల్లలను కూర్చోబెట్టే పరిస్థితులు మారాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంలో ఆటోలను సైతం రవాణాశాఖ అధికారులు తనిఖీ చేయడం, ఆటో, బస్సు డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్ ద్వారా తరచూ చెక్ చేయాల్సిన అవసరం ఉంది. రవాణాశాఖ అధికారుల సంఖ్య పరిమితం కాబట్టి ట్రాఫిక్, సివిల్ పోలీసులు కూడా ఈ రకమైన తనిఖీలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ప్రమాదాల నివారణ సందర్భంగా విద్యా సంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు, అటెండెంట్లతోపాటు యాజమాన్యాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, డ్రైవర్లకు మెడికల్ చెకప్ నిర్వహించడం వంటివి పాఠశాలల ప్రారంభానికి ముందే నిర్వహిస్తే బాగుంటుంది. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒక్కో విద్యార్థి వద్ద వసూలు చేసే బస్ ఫీజులు చూస్తే వామ్మో అనాల్సిందే. ప్రభుత్వం, రవాణాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై కూడా దృష్టిపెట్టి పరిమిత చార్జీలు వసూలు చేసేలా చూడాల్సిన అవసరం ఉంది.

త్యాగమయ జీవితం..బక్రీద్ సందేశం

- బక్రీద్ పండుగ నేడు

కనిగిరి రూరల్/కంభం: సృష్టి ఎంతో అద్భుతమైంది.. ఎంత పరిశీలించినా... పరిశోధించినా అర్థం కానిది. అధ్యయనం చేయవలసింది ఇంకా ఎంతో ఉందనిపిస్తుంది. మానవుని ఆలోచన పరిధికి మించి ఈ సృష్టిని నియంత్రించే శక్తి ఒకటి ఉంటుందని ఆ శక్తి అల్లాహ్ (దైవం) అంటామని, ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనుకాడకూడదని సందేశాన్నిచ్చే పండుగ బక్రీద్. ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతి, సహనశీలత, రుజువర్తనలను ఈ పండుగ తెలుపుతుంది. మానవాళికి మార్గదర్శకత్వం వహించడానికి దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదువేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన దేవుడే సకల చరాచర సృష్టి కారకుడని, ఆయన పట్ల భక్తి, శ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందవచ్చని జాతికి పిలుపునిచ్చారు.

ముస్లింలు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగల్లో రంజాన్ తర్వాత బక్రీద్ ఒకటి. దీనినే ఈదుల్ అజహా, ఈదుజ్జుహా అని కూడా పిలుస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్ హిజ్ 10వ తేదీ బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకుంటారు. ఇస్లాంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో ఒకటైన హజ్ తీర్థయాత్రను కూడా ముస్లింలు ఈనెల ప్రారంభంలోనే భక్తి ప్రపత్తులతో, నియమ నిష్ఠలతో చేస్తారు. నేడు బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకోనున్నారు.

బక్రీద్ పండుగను ఎందుకు చేస్తారంటే..

ఈదుల్ జుహా అనేది మనిషి త్యాగ నిరతిని చాటి చెప్పే పండుగ. ఈ పండుగనే బక్రీద్ అంటారు.



కనిగిరిలో ప్రత్యేక నమాజ్‌లో ముస్లింలు సోదరులు (ఫైల్)

బక్రీద్ ఎందుకు జరుపుకుంటారంటే.. ప్రవక్త ఇబ్రహీంకు దైవం మరొక కఠిన పరీక్ష పెట్టారు. కలలో అందిన సూచన మేరకు ఆయన తన కుమారుడిని బలి ఇచ్చేందుకు సిద్ధమవుతారు. కుమారుడు కూడా దైవాజ్ఞను శిరసా వహించేందుకు అంగీకరిస్తాడు. తండ్రి ఇబ్రహీం కుమారుడిని 'జుబాహ్' చేశాడు. తీరా చూస్తే కుమారుడికి బదులు అక్కడ ఒక పొట్టేలు జుబాహ్ చేయబడి ఉంటుంది. దైవం పట్ల ప్రవక్త ఇబ్రహీంకు ఉన్న అచంచల భక్తి, విశ్వాసాలకు, త్యాగ నిరతికి ప్రతీకగా ముస్లింలు ఏటా 'ఈద్-ఉల్-జుహా' (బక్రీద్) పండుగను జరుపుకుంటున్నారు.

మూడు భాగాలుగా విభజించి..

బక్రీద్ పండుగ సందర్భంగా ఒంటె, మేక, గొర్రెలను ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ చేసిన తర్వాత దాన్ని మూడు భాగాలుగా విభజిస్తారు. ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంచుతారు. ఇంకొక భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు.



కంభంలో ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు (ఫైల్)

ఈద్గా వద్ద నమాజ్..

రంజాన్ లాగా బక్రీద్ పండుగకు కూడా ఈద్గా వద్ద నమాజ్ చదువుతారు. (ఖుద్బా) ధార్మిక ప్రసంగం తర్వాత ఈద్గా నమాజ్ జరుగుతుంది. బక్రీద్ నమాజ్ ఈద్గా లేదా మసీదులో సామూహిక (జమాత్‌తో) ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి.

బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు:

బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం నమాజ్ ను కనిగిరిలో మూడు చోట్ల ప్రత్యేక ప్రార్థనలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు సమయాన్ని ప్రదేశాలను ఇప్పటికే ప్రకటించారు. మసీద్ ఏ అలీ పాత నాల్గొవ వార్డు (ప్రస్తుత 8వ వార్డు) మసీద్‌లో ఉదయం 7 గంటలకు బక్రీద్ పండుగ ప్రత్యేక బయాన్, 7.30 గంటలకు ప్రత్యేక నమాజ్ జరుగుతుంది. వృద్ధులు, ఆరోగ్యం బాగా లేని వారు, నడవలేని వారు ఇక్కడ నమాజ్ చదువుకుంటారు. ఈద్గా వద్ద (కనిగిరి పెద్ద చెరువు వద్ద ప్రత్యేక ప్రార్థనా స్థలంలో) ఉదయం 8.30 గంటలకు బయాన్, అనంతరం 9 గంటలకు ప్రత్యేక నమాజ్ జరుగుతుంది. అలాగే ఛోటి మసీద్‌లో (పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ వద్ద మసీద్‌లో) ఉదయం 10 గంటలకు బయాన్, 10.30 ప్రత్యేక నమాజ్ జరుగుతుందని ముఫ్తి అబ్దుల్ కలాం తెలిపారు

కంభంలో...

బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం నిర్వహించే ప్రార్థనల కోసం ఈద్గా మైదానంతో పాటు మసీదులు ముస్తాబయ్యాయి. తమ ఇళ్ల వద్ద నుంచి ర్యాలీగా బయల్దేరి వెళ్లి ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈద్గా వద్దకు వెళ్లలేని వారి కోసం మసీదుల్లో ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు ఈద్గాలో నమాజు ప్రారంభమవుతుందని, ఆలోపు అందరూ అక్కడికి చేరుకోవాలని కమిటీ పెద్దలు తెలిపారు.

ఉత్సాహంగా ఆర్చరీ జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ నాయకులు



విలువిద్యలో తమ ప్రావీణ్యత చాటుతున్న చిన్నారులు

ఒంగోలు: ఆర్చరీ జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక ఏబీఎం డిగ్రీ కాలేజీ ఆవరణలో ఆదివారం జరిగింది. అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాల్లో ఇండియన్ రౌండ్, రికర్వ్ రౌండ్ విభాగాల్లో ఈ ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను ప్రకాశం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రామకృష్ణారావు, పి.లెమ్యూల్‌రాజు పర్యవేక్షించారు. మొత్తం 21 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు శాతవాహన కాలేజీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకెళ్లేందుకు మేనేజర్లుగా బి.రాంబాబు, బి.గోపీచంద్‌లను ఎంపిక చేశామని సంఘ కార్యదర్శి లెమ్యూల్‌రాజు తెలిపారు.

యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జైశ్రీకృష్ణ బీసీ సమితి నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు జై శ్రీకృష్ణ బీసీ సమితి నాయకులు ద్రావిడ దేశం కృష్ణారావు, డాక్టర్ పెరుగు మురళీకృష్ణయాదవ్, అడకా స్వాములు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. జిల్లా మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలో చదువుకున్న ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించేందుకు మే నెలలో దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. తమ సంస్థలో సభ్యులైన నిష్ణాతులైన ఉపాధ్యాయులచే దరఖాస్తులు, ఎంపిక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 23వ తేదీ ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.3 వేలు, రెండో బహుమతిగా రూ.2 వేలు, మూడో బహుమతిగా రూ.1000 చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మొదటి మహిళ పద్మశ్రీ సంతోష్ యాదవ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.రమణ కుమార్, ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ గోసు రమేష్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రముఖ కెరీర్ గైడెన్స్ నిష్ణాతులు మేకల హరికృష్ణ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారని, సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు.

పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెంచాలి

- పెన్షనర్ల సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ కరీం

ఒంగోలు అర్బన్: సీనియర్ పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ కరీం కోరారు. స్థానిక నిర్మల్ నగర్‌లో జిల్లా అధ్యక్షుడు బడే అంకిరెడ్డి అధ్యక్షతన ఆదివారం ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి అబ్దుల్ కరీం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అడిషనల్ క్వాంటంతో పాటు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఇన్‌కమ్ ట్యాక్స్ ఎత్తివేయాలన్నారు. లేదా పెన్షనర్లకు ప్రత్యేకమైన స్లాబులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సంఘం మరింత పటిష్టంగా ఉండేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ గౌరవాధ్యక్షుడు వి.పున్నయ్య, ప్రధాన కార్యదర్శి కంచర్ల సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎంవీ శేషయ్య, మన్నం హనుమంతరావు, తూమాటి మాలకొండయ్య, శ్యామలరావు, మారెళ్ల వెంకటరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, ప్రభాకర్, శ్రీరామమూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కరీంను జిల్లా సంఘం సత్కరించింది.



అబ్దుల్ కరీంను సత్కరిస్తున్న నాయకులు

జై హనుమాన్..



హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీలో పాల్గొన్న రామ భక్తులు



20 అడుగుల హనుమాన్ విగ్రహం

- శోభాయమానంగా హనుమాన్ శోభాయాత్ర
- బైక్ ర్యాలీలో పాల్గొన్న రామ భక్తులు

ఒంగోలు మెట్రో: హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో తలపెట్టిన హనుమాన్ శోభాయాత్ర ఆదివారం సాయంత్రం ఒంగోలులో వైభవంగా నిర్వహించారు. సంతపేట వీరాంజనేయ స్వామి దేవస్థానం వద్ద నుంచి 20 అడుగుల హనుమాన్ విగ్రహంతో, డీజే, మేళతాళాలతో రెండు వేలకు పైగా బైకులతో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

తొలుత ప్రముఖ వేద పురోహితుడు మఠంపల్లి దక్షిణామూర్తి, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంతపేట వీరాంజనేయ స్వామి దేవస్థానం వద్ద బయలుదేరిన బైక్ ర్యాలీ సంతపేట నాటు బాబురావు పార్కు మీదుగా, ట్రంకు రోడ్డు, కలెక్టరేట్, పాత కూరగాయల మార్కెట్, అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్డు బైపాస్, మంగమూరు రోడ్డు కూడలి, చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం, లాయర్ పేట షిరిడీ సాయి దేవస్థానం మీదుగా, కొణిజేడు బస్టాండ్, కరెంట్ ఆఫీస్ కేశవ స్వామి పేట ఆలయాల వరకు నిర్వహించారు. ఒంగోలు, పరిసర ప్రాంత ప్రజలు అందరూ ఈ బైక్ ర్యాలీలో పాల్గొని సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఆశీస్సులు అందుకున్నారు

క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు




యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ముస్లింలకు ఆదివారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. తోటివారిపట్ల త్యాగం, కరుణ, సహనంగా ఉండాలన్న సందేశాన్ని ఇచ్చే బక్రీద్ పండగను నియోజకవర్గంలోని ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు. దర్శి: దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కూడా ముస్లిం సోదరులు, ప్రజలకు బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

మద్దిపాడు: మోటారు సైకిల్ ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలైన సంఘటన జాతీయ రహదారిపై మద్దిపాడు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. మద్దిపాడు బీసీ కాలనీకి చెందిన నాయుడు నరసమ్మ (67) వ్యాపారం నిమిత్తం వేరే గ్రామం వెళ్లి తిరిగివచ్చి మద్దిపాడు లారీ యూనియన్ ఆఫీసు సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా కనిగిరి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన ఉద్యోగ నిమిత్తం బైకుపై కోదాడ వెళ్తూ వృద్ధురాలిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధురాలి ఎడమ చేయి నుజ్జువగా, తల, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లుకు కాలి వద్ద గాయం అయింది.

నూరేళ్ల నేరేడు

నేరేడు పండు అంటే తెలియని వారుండరు. ఈ పండును పిల్లలు, పెద్దలు అమితంగా ఇష్టపడతారు. నేరేడు పండును వేసవి కాలపు పండుగా చెబుతారు. ఇందులో మనకు తెలియని ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మధుమేహంతో పాటు అనేక శారీరక సమస్యలను నేరేడు పండు దూరం చేస్తుంది. పశ్చిమ ప్రకాశంలో ఇప్పుడిప్పుడే ఈ పంట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

- నేరేడు పండ్లతో సంపూర్ణ ఆరోగ్యం
- గతంలో మహా రాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి పండ్ల దిగుమతి
- నేడు పశ్చిమ ప్రకాశంలో నేరేడు పంట సాగుపై రైతుల ఆసక్తి
- కిలో రూ.150 వంతున రైతు అమ్మకం, మార్కెట్‌లో ధర రూ.250, రూ.300
- డయాబెటిక్ రోగులకు ఎంతో మేలు




నిండుకాపుతో ఉన్న నేరేడు చెట్టు

బేస్తవారిపేట:

పశ్చిమ ప్రకాశంలో గతంలో వర్షాభావ పరిస్థితులు ఉండటంతో పాటు ఖర్చు తక్కువ ఉండటంతో రైతులు నేరేడు పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. చీడపీడలు తక్కువగా ఉండటంతో పురుగుమందుల పిచికారీ అవసరం ఉండదు. డయాబెటిక్ రోగులు ఎక్కువ అవుతుండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, రాయచోటి, అనంతపురం జిల్లాల నుంచి నేరుడు పండ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. పశ్చిమ ప్రాంతంలో కొందరు రైతులు నేరుడుపై అవగాహన పెంచుకుని దాదాపు 70 ఎకరాల్లో పంట సాగు మొదలు పెట్టారు. గిద్దలూరు నియోజకవర్గంలో 20 ఎకరాల్లో నేరేడు పంట సాగు చేశారు. కిలో రూ.150కు రైతు అమ్ముతున్నాడు. మార్కెట్‌లో రూ.250-రూ.300 ధర పలుకుతోంది.

పోషక విలువలు ఇలా..

ప్రతి 100 గ్రాముల నేరేడు పండ్లలో ప్రొటీన్స్ 0.07 శాతం, కొవ్వులు 0.3, ఖనిజాలు 0.04, పీచు 0.9, పిండి పదార్థాలు 15 ఎంజీ, ఫాస్పరస్ 15, ఐరన్ 1.2, విటమిన్ సీ 18 ఎంజీ, పొటాషియం 55 ఎంజీ ఉంటాయి. నేరేడులో ఉండే ఆమ్లగుణం వల్ల దీన్ని జాంలు, వెనిగర్, సాండీస్, ఆల్కహాల్ తక్కువ శాతం ఉండే వైన్‌ల తయారీలో వాడతారు.

ఆరోగ్య ప్రయోజనాలు..

నేరేడు పండులో అతి తక్కువ గ్లెసైమిక్ ఇండెక్స్ ఉండటంతో షుగర్ వ్యాధిగ్రస్తుల పాలిట గొప్పవరంగా మారింది. మధుమేహంతో బాధపడేవారు నేరేడు గింజల పొడిని నీటితో కలిపి తీసుకోవడం వల్ల శరీరంలోని చక్కెర శాతాన్ని తగ్గించుకోవచ్చు. అధిక రక్తపోటు సమస్యను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

- పండులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.
- నేరేడు పండు రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా రక్తంలో కేన్సర్ కారకాలు వృద్ధి చెందకుండా నిరోధిస్తుంది.
- ఈ పండ్లను తినడం ద్వారా దంత సమస్యలను తగ్గించుకోవచ్చు. ఇది దంతాలను, చిగుళ్లను బలంగా చేస్తుంది. నోటి సమస్యలను తగ్గిస్తుంది. నోటిలో కురుపులు, పుండ్లను, అల్సర్లను నివారిస్తుంది. ఆకులను నమిలి నీళ్లతో పుక్కిలించి ఉమ్మి వేస్తుంటే నోటి దుర్వాసన పోతుంది, కషాయంగా చేసుకుని తాగడంతో దంత సమస్యలు దూరం అవుతాయి.
- నేరేడు గింజలపొడి ముఖానికి పాలతో కలిపి ప్యాక్‌గా వేసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రాషెష్, మొటిమలు దూరం అవుతాయి.
- జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. కడుపులో ఏర్పడే గ్యాస్ వంటి సమస్యలకు ఇది ఒక చక్కని పరిష్కారాన్ని చూపుతుంది. కడుపు ఉబ్బరం, వాంతి అయ్యేలా ఉండే లక్షణాలను తగ్గిస్తుంది. మలబద్ధకంతో పాటు మూత్ర సమస్యలను నివారిస్తుంది.
- ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలను దూరం చేస్తుంది. అనేక చర్మ వ్యాధులకు, చర్మంపై వచ్చే తెల్లటి మచ్చలను తగ్గించేందుకు సహాయపడుతుంది.
- కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.

> **రూ.30 వేల ప్రభుత్వ సాయం:**
> నేరేడు పంటను సాగు చేయాలనుకునే రైతులకు హెక్టార్‌కు ప్రభుత్వం దాదాపు రూ.30 వేలు ఇస్తుంది. బహదోలి, బోడ, చింతామణి రకాలు అధిక దిగుబడులను ఇస్తాయి. రైతులు షోలాపూర్ నుంచి మొక్కలను తెచ్చుకుంటున్నారు. మార్కెట్‌లో నేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడిప్పుడే రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.
> **శ్వేత**, ఉద్యానవన శాఖ అధికారి


నేరేడు పండ్ల తోట

నిరాశాజనకంగా చేపల వేట


సింగరాయకొండ: వేటకు వెళ్లి వస్తున్న బోటు

- ఆందోళనలో మత్స్యకారులు

సింగరాయకొండ: సముద్రంలో చేపల వేట ఆశాజనకంగా లేకపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేట నిషేధకాలం. ఈ నెల 15వ తేదీ శనివారం నుంచి వేట నిషేధకాలం ముగియడంతో మత్స్యకారులు ఆనందంగా చేపల వేటకు వెళ్లారు. కానీ వంజరాలు రకం చేపలు మాత్రమే వలల్లో పడ్డాయని అది కూడా కేవలం 5 నుంచి 10 కేజీలు మాత్రమే పడ్డాయని మత్స్యకారుడు గొల్లపోతు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వంజరాలు కేజీ 300 రూపాయలుందని ఈ ప్రకారం కేవలం ఒక రోజు వేటకు వెళితే 1,500 నుంచి 3 వేల రూపాయలు మాత్రమే వచ్చాయని వివరించారు. దీంతో ఆదివారం చేపల వేటకు వెళ్లలేదని ఊళ్లపాలెం మత్స్యకారులు తెలిపారు. వాస్తవానికి నెల్లూరు జిల్లా రామాయపట్నం మత్స్యకారులు ఈ నెల 6వ తేదీ నుంచే చేపల వేటకు వెళ్లారని వారికి రోజుకు 20 వేల నుంచి 50 వేల వరకు చేపలు పడ్డాయని తీరా తాము నిషేధకాలం ముగిసిన తరువాత వేటకు వెళితే వేట ఆశాజనకంగా లేదని దీనికి తోడు వేట నిషేధ భత్యం కూడా ఎప్పుడు వస్తుందో అర్థం కావడం లేదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వేట నిషేధ భత్యం త్వరగా వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మానవాళికి గొప్ప సందేశం.. బక్రీద్ పండుగ

- అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: ప్రపంచ మానవాళికి గొప్ప సందేశాన్ని, స్ఫూర్తినిచ్చిన బక్రీదు పండుగను సోమవారం ప్రశాంత వాతావరణంలో సుఖసంతోషాలతో జరుపుకోవాలని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. జీవితంలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో జీవనం కొనసాగించాలని బక్రీదు పండుగ సందేశమిస్తుందని తెలిపారు. మనకు ఉన్న దాంట్లో నుంచి ఇతరులకు పంచిపెట్టే దాతృత్వ గుణాన్ని పెంపొందించే బక్రీదు పండుగ అందరికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బక్రీదు పండుగ వేడుకలు, కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లాలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, మండల కేంద్రాల్లో మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమ రవాణాకు గురైన గోవులకు షల్టర్ కల్పించాల్సిందిగా రెవెన్యూ, యానిమల్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. గోవుల షల్టర్ వద్ద అందుబాటులో ఉండాలని వెటర్నరీ వైద్యులకు సూచించినట్లు తెలిపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూసేందుకు మత ఘర్షణలను ప్రేరేపించేలా ప్రవర్తించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

బాలుడి మెడలోని బంగారు నగలు చోరీ

ఒంగోలు టౌన్: శుభకార్యంలో ఒక చిన్నారి మెడలోని బంగారు నగలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి మండలంలో వెన్నూరు గ్రామానికి చెందిన పోగూరి వంశీ కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి ఒంగోలులో బంధువుల ఇంట్లో జరిగిన ఒక శుభకార్యానికి హాజరయ్యారు. స్థానికంగా ఎంఎస్ ఫంక్షన్ హాలులో కార్యక్రమం జరుగుతుండగా వంశీ కృష్ణ చిన కుమారుడైన 7 ఏళ్ల జయవర్ధన్‌తో ఒక గుర్తు తెలియని వ్యక్తి మాటమాట కలిపాడు. మాయమాటలు చెప్పి బెలూన్ ఇప్పిస్తా రమ్మని వెంట తీసుకెళ్లాడు. ఫంక్షన్ హాలుపై అంతస్తులోకి తీసుకెళ్లి బాబు మెడలో ఉన్న 2 సవర్ల బంగారు చైను, 16 గ్రాముల బ్రాస్‌లేట్, 6 గ్రాముల బంగారు ఉంగరం తీసుకొని మాయమయ్యాడు. కాసేపటి తరువాత ఏడుస్తూ వచ్చిన జయవర్ధన్ జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. చుట్టూ పక్కల వెదికినా అనుమానితుడి ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ శాఖ ఉద్యోగులపై దాడి

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట గ్రామంలో అక్రమంగా వెదురు బొంగులు తరలిస్తున్న వారిని అడ్డుకున్నందుకు అటవీ శాఖ అధికారులపై వారు దాడికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. ఈమేరకు ఆదివారం స్థానిక సీఐ వైవీ సోమయ్య తెలిపారు. ఫారెస్ట్ బీటు ఆఫీసర్ కయూమ్ ఫిర్యాదు మేరకు దిగువమెట్ట గ్రామంలో తమ విధి నిర్వహణలో భాగంగా అక్రమంగా వెదురుబొంగులను తరలిస్తున్న వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నాడు. ఈ నేపథ్యంలో అటవీశాఖ ఉద్యోగులపై వారు తిరగబడి దాడికి పాల్పడినట్లు తెలిపారు. 5 గురు వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆంధ్రరాష్ట్ర ఆదిశైవ సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

చీరాల అర్బన్: ఆంధ్రరాష్ట్ర ఆదిశైవ సంఘం బాపట్ల జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక పేరాలలోని పునుగు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బాపట్ల జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో బాపట్ల జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా స్వర్ణ సుబ్రహ్మణ్య బాపూజీ, ప్రధాన కార్యదర్శిగా మూలంరాజు రాజ్‌కుమార్, కోశాధికారిగా చందలూరి శ్రీనివాసరావు, జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఎస్.మల్లికార్జున ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలానే చీరాల శివాలయం అర్చకులు స్వర్ణ దివాకర్‌శర్మను రాష్ట్ర కమిటీకి తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కోశాధికారి మురికిపూడి క్రిష్ణకిశోర్, పేటేటి వాసుదేవరావులు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణను కారంచేటి శివరామకృష్ణ, కారంచేటి నగేష్‌కుమార్‌లు నిర్వహించారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు

ఉద్యోగ విధులకెళ్తూ..


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్సై

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం
- కంటైనర్‌ను ఢీకొన్న కారు

కోవూరు: శుభకార్యం నిమిత్తం సొంతూరొచ్చి.. తిరిగి ఉద్యోగ విధులకు వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను రోడ్డు ప్రమాదం కబళించిన ఘటన కోవూరు పరిధిలోని జాతీయ రహదారిపై ఏసీసీ కల్యాణ మండప సమీపంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం అంబలపూడికి చెందిన కూరపాటి మురళీమోహన్ (41) చెన్నైలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఓ శుభకార్యం నిమిత్తం ఊరొచ్చిన ఆయన తిరిగి తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో కోవూరు సమీపంలోని జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని కోవూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మురళీమోహన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటన స్థలాన్ని ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రోజులుగా
తెరిచి ఉన్న సచివాలయం తలుపులు


తలుపులు తెరచి ఉన్న సచివాలయం


సచివాలయంలో ఉన్న ఫర్నిచర్

దర్శి: మండలంలోని బండి వెలిగండ్ల గ్రామంలో సచివాలయం తలుపులు మూడు రోజులుగా తెరిచే ఉన్నాయి. సచివాలయం సిబ్బంది నిర్లక్ష్యంపై గ్రామస్తులు మండి పడుతున్నారు. ఆదివారం సాయంత్రం కూడా తలుపులు తెలిచి ఉండటంపై పలు అనుమానాలకు తావిస్తోంది. సచివాలయంలో ఫర్నిచర్, కుర్చీలు అలాగే బయటకు దర్శనం ఇస్తున్నాయి. మూడు రోజులుగా తలుపులు తెరచి ఉండటంపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది.


గూడు నిర్మించుకుంటున్న తల్లి పక్షి


గిజిగాడి గూళ్లు

ప్రకృతి ఆర్కిటెక్ట్

పుల్లలచెరువు: అందంగా గూడు నిర్మించడంలో గిజిగాడికి ఎవరూ సాటిరారు. గిజిగాడి గూడు అమరిక, నేర్పరితనం, కళాత్మక నైపుణ్యం అబ్బుర పరుస్తుంది. సన్నటి గడ్డి పరకలతో అందంగా గాలి ఊయల మాదిరిగా గూళ్లను నిర్మించుకోవడం వీటి ప్రత్యేకత. దీనికి ఎవరైనా సెల్యూట్ కొట్టాల్సిందే. గ్రామాల్లో వీటి గూళ్లు చెట్లకూ వేల్లాడుతూ ఆకట్టుకుంటున్నాయి. అయితే అన్ని గూళ్లు కూడా సమానంగా ఉండటం విశేషం. మండల కేంద్రం నుంచి యర్రగొండపాలెం వెళ్లే ప్రధాన రహదారి పక్కన వేప చెట్టు నిండా గూళ్లు వేలాడుతూ చూపరులకు కనువిందు చేస్తున్నాయి. పాములు, గద్దల నుంచి గుడ్లు, పిల్లలను రక్షించుకునేందుకు అనేక జాగత్తలు తీసుకుంటాయి. ఈ పక్షులు గూళ్లు తయారు చేసే విధానం ఎవరికీ అర్థం కావడంలేదని వృద్ధులు చెబుతున్నారు. ఈ అరుదైన దృశ్యాన్ని 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.


గిజిగాడి పక్షి

తేనెటీగల దాడిలో ఒకరు మృతి


మృతుడు జుటికె సుందర్‌రావు

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువు గ్రామానికి చెందిన జుటికె సుందర్‌రావు (57) తేనె టీగల దాడిలో మృతి చెందారు. గ్రామానికి చెందిన జుటికె సుందర్‌రావు, ఆయన భార్య రోజమ్మ ద్విచక్ర వాహనంపై కనిగిరి వెళ్తున్నారు. ఇమ్మడిచెరువు, రామలింగాపురం గ్రామాల మధ్య పెద్ద తేనె టీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. క్షతగాత్రులను కనిగిరి తరలిస్తుండగా జుటికె సుందర్‌రావు మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు భార్య రోజమ్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. శివ తెలిపారు.

సముద్ర స్నానం చేస్తూ విద్యార్థి గల్లంతు

చీరాల: విహారయాత్ర విషాదాన్ని నింపింది. చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్రతీరంలో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. నూజివీడులోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న 11 మంది విద్యార్థులు ఆదివారం వాడరేవు సముద్ర తీరానికి విహారయాత్రకు వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి కోసూరి కార్తిక్ (19), మైలవరపు కేదారేశ్వరరావులు అలల ధాటికి గల్లంతయ్యారు. స్నేహితులు ఇద్దరు సముద్రంలో చిక్కుకోవడంతో మిగిలిన వారు కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు కేదారేశ్వరరావును కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. కోసూరి కార్తిక్ అలల ధాటికి గల్లంతయ్యాడు. ఈమేరకు రూరల్ పోలీసులు విద్యార్థుల వద్ద నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు.